క్లుప్తంగా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



నకరికల్లు: ఖరీఫ్ 2023కు గాను కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు అందజేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ వీఆర్ఓలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కౌలురైతులను గుర్తించి సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలన్నారు. చుక్కల భూములను జీఓ నంబర్ 73 ప్రకారం నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం తొలగించిందన్నారు. చుక్కల భూముల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం జారీచేసిన సర్టిఫికెట్లను రైతులకు అందజేయాలని సూచించారు. నీటితీరువా బకాయిలను వసూలు చేసి సచివాలయం ఆన్‌లైన్ రశీదులను రైతులకు అందజేయాలన్నారు. ఆయా గ్రామాల వీఆర్ఓలు పాల్గొన్నారు.

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): కౌలు రైతులకు అందించే పంటసాగుపత్రం వలన అనేక ప్రయోజనాలున్నాయని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లో కౌలురైతు కార్డుల ఎంపికపై అవగాహన గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో పాల్గొన్న తహసీల్దార్ భవానిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే ప్రోత్సాహక పథకాలను పొందవచ్చన్నారు. ఆయా గ్రామసభల్లో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, ఇన్‌చార్జ్ ఆర్ఐ కపిల్‌దేవ్, వీఆర్వో సంజీవరావు, రైతులు పాల్గొన్నారు.

గాయత్రీ కలశ శోభాయాత్ర



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని సాందీపని ఆశ్రమంలో గాయత్రిమాత జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గ్రామంలో తెల్లవారుజామున గాయత్రి కలశ శోభాయాత్ర నిర్వహించారు. గాయత్రి పరివార్ సభ్యులు కలశాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా ఆశ్రమం వరకు యాత్రగా తరలివెళ్లారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, గాయత్రిహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రహదారి సర్వే వేగవంతం చేయాలి



ముప్పాళ్ళ: కొండమోడు–పేరేచర్ల జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెం సమీపంలో రహదారి నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న సర్వే పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. భూములకు సంబంధించి రైతుల పూర్తిస్థాయి వివరాలు నమోదు పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీదేవి జన్మదినోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని 6వ వార్డు నందు గల ఫిరోజీ రుషిందుల వారి మఠంలో వెంచేసి ఉన్న వేదమాత గాయత్రి దేవి ఆలయంలో మంగళవారం గాయత్రి అమ్మవారి జన్మదినం శుభ సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జ్యేష్ట శుద్ధ దశమి సందర్భంగా ఉదయం నుంచి మేళ తాళాలతో జన్మదిన మహోత్సవ కార్యక్రమాలు, పంచామృతాభిషేకం, కలశాభిషేకం, విశేష పూజలు, విశేష అర్చన చేపట్టారు. అచ్చంపేట రోడ్ లోని శివాలయం నుంచి మేళతాళాలతో అభిషేక జలాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి అభిషేకం, తదుపరి విశేషాలంకరణ నిర్వహించారు. వేదమాత గాయత్రి అమ్మవారి భక్త సమాజం, ఛత్రపతి శివాజీ యూత్, శ్రీ భక్తాంజనేయ స్వామి భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు బలైన జీవాలు

యడ్లపాడు: పిడుగు పాటుతో 9 జీవాలు మృతి చెందాయి. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన జీవాల పోషకులు మంగళవారం తమ మేకల్ని, గొర్రెల్ని తీసుకుని గ్రామ సమీపాన ఉన్న ప్రత్తిపాడు –కొప్పర్రు గ్రామల మధ్య పొలాలకు తీసుకెళ్లారు. ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. దీంతో మందలోని కొన్ని జీవాలు చీలి పొలంలోని ఓ చెట్టువద్దకు చేరాయి. ఇంతలోనే పెద్దశబ్దంతో ఆ చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు చెంతనే ఉన్న 9 జీవాలు అక్కడిక్కడే మృతి చెందాయి. వాటిలో యలగాల నాగరాజుకు చెందిన 4 జీవాలు, సాయిబాబు, పున్నారావు, శ్రీను, పరమేశ్వరరావు, శివకోటేశ్వరరావుకు చెందిన ఒక్కొక్కటీ ఉన్నాయని తెలిపారు.

సీఎం జగన్ పాలన స్వర్ణయుగం

- చంద్రబాబును నమ్మే పరిస్థితి రాష్ట్రంలో లేదు
- గతంలో 600 హామీలిచ్చి వెన్నుచూపారు
- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- నాలుగేళ్ల పాలన సంబరాల్లో భాగంగా బైక్‌ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: రాష్ట్రస్థాయినుంచి గ్రామ స్థాయి వరకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను సుస్థిరంగా అమలుచేయటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నా రు. మంగళవారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా అమరావతి అంబేడ్కర్ విగ్రహం నుంచి మండల పరిధిలోని దిడుగు గ్రామంలోని మహానేత వైఎస్సార్ విగ్రహం వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం పోటాపోటీగా సాగుతున్నాయన్నారు. కరోనా సంక్షోభంలో ఆదాయం లేకపోయినా ప్రజల ఆరోగ్యంతో పాటు, కరోనా ని యంత్రణ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమ లు చేసిన తీరును పలు రాష్ట్రాలు, కేంద్రం ప్రశంసించాయన్నారు. చంద్రబాబు గతంలో 600హామీలిచ్చి చేతులెత్తేసిన విషయం అందరికీ తెలిసిందే. రైతురుణమాఫీ చేయలేక రైతులను డ్వాక్రా రుణమాఫీ అని మహిళలను, నిరుద్యోగభృతి అని యువకులను ఫీజు రీయింబర్స్‌మెంట్ అని విద్యార్థులను ఇలా అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత చంద్రబాబుకు మాత్రమే దక్కుతుందన్నారు. ఇప్పుడు మళ్లీ రాజమండ్రి మహానాడులో ఇతర రాష్ట్రాలలో వివిధ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను కాపీ కొట్టి చెబుతున్న మాయమాటలను ప్రజలు నమ్మటానికి సిద్ధంగా లేరన్నారు. పెదకూరపాడు నియోజవర్గంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డువరకు రూ.149కోట్ల తో డబుల్‌రోడ్డు నిర్మాణం, రూ.60కోట్లతో మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ నిర్మాణాలకు జూన్ మొదటివారంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తున్నామన్నారు. నియోజవర్గంలో సుమారు రూ.2వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసిన జగనన్నను, తనను పెదకూరపాడు ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా పోరాడలన్నారు. జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, నిమ్మా విజయసాగరబాబు, నాయుడు రాంబాబు, మాదాసు రాంబాబు, ఆలా లక్ష్మీనారాయణ, నందూరు కరుణకుమార్, దిడుగు సర్పంచి వింతా శ్రీలక్ష్మి, బ్రహ్మారెడ్డి, రోశయ్య, తదితరులతో పాటుగా పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరో 40 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రి..

పెదకూరపాడు: సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కట్టి నాలుగేళ్లు పూర్తి అయిందని, మరో 40 ఏళ్లు కూడ ప్రజలు ఇదే పాలన కోరుకుంటున్నారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరి వసంతకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బెల్లంకొండలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వసంతకుమారి మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. మరోసారి పెదకూరపాడులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఎంపీపీ పద్మ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ మరియదాసు, ప్రసాద్‌రెడ్డి, గాదె వెంకటరెడ్డి, ధరియా, మౌలాలి, వెంకటసైదయ్య, రమణరెడ్డి, నరసింహనాయక్, బాపూజీ, శ్రీనివాసరావు, పాప, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషురెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల నాయకులు మంగళవారం క్రోసూరులో ఘనంగా సంబరాలు నిర్వహించారు. క్రోసూరులోని నాలుగురోడ్ల సెంటర్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి అందరూ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య మాట్లాడుతూ సీఎం జగనన్న పాదయాత్ర ద్వారా రాష్ట్రప్రజల కష్టాలు తెలుసుకుని ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన నాయకుడు దేశంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరు మాత్రమే అని అన్నారు. జెడ్పీటీసీ జమీలా గఫూర్ మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, లిడ్ క్యాప్ డైరక్టర్ మురళి, యార్డు మాజీ డైరక్టర్ పాశం శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, సయ్యద్ అబ్దుల్ రహీం, ఏఎంసీ మాజీ చైర్మన్ డాక్టర్ షరీఫ్, అనుమల శ్రీనివాసరెడ్డి, షేక్ అబ్దుల్‌ఖాదర్, అదితి ముస్తఫా, షేక్ బాజి, ఎంపీటీసీ చిల్కారవి తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: ప్రజా సంక్షేమ పాలనకు నాలుగేళ్లు పూర్తయ్యాయని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్ కుమార్, జిల్లా పార్టీ కార్యదర్శులు కంకణాల శివాజీ, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషు, బత్తుల కోటేశ్వరరావులు అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పెదకూరపాడులోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. నాయకులు బచ్చు హనుమంతురావు, కంచర్ల అచ్చుత్‌రావు, అశోక్, నల్లమేకల సురేంద్ర, ఎంపీటీసీ షేక్ బుడా, మన్నవ జోసఫ్, గోవింద్, చిన్నమక్కెన బాజీ, మల్లెల సుధాకర్, యూసూబ్‌ఖాన్, మధు, క్రాపా వీర సింహం, రామకృష్ణ, బుడ్డా, చాంద్‌మా సుభాని, చాట్ల జోజి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో అన్ని వర్గాలవారికి మేలు చేకూరిందని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారు సంక్షేమపథకాలతో సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య అన్నారు. జగనన్న పాలనకు నాలుగేళ్లు నిండిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం సంబరాలు నిర్వహించారు. కేట్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, సొసైటీ చైర్మన్ రామిశెట్టి రంగయ్య, ఆర్యవైశ్య జిల్లా నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, ఓర్వకల్లు సర్పంచ్ పేరయ్య, మండల బీసీసేన అధ్యక్షుడు షేక్ జాని, పూల వెంకటేశ్వర్లు, రామచంద్రరావు పాల్గొన్నారు.

అందరికీ మేలు చేసే సీఎం చల్లగా ఉండాలి : ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

పెదకూరపాడు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పెదకూరపాడులోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన లో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ముఖ్యమంత్రిగా ఆయన పాలన నిరంతరం కొనసాగాలని ప్రార్థించారు.



బెల్లంకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి వసంతకుమారి, ఎంపీపీ పద్మ వెంకటేశ్వరరెడ్డి



క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు



అచ్చంపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



పెదకూరపాడులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సమన్వయంతో పనిచేస్తేనే మండలాభివృద్ధి

మండల సర్వసభ సమావేశంలో ఎంపీపీ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేచారపు అనురాధ, పక్కన ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విస్తృతస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. శాఖలవారీగా చేపడుతున్న పథకాలు, అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలను ఆయాశాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి పూర్తయ్యేవరకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, బీమా పథకాలు సకాలంలో అందజేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలని తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు నిర్దేశిత సమయాల్లో విలేజ్ క్లినిక్‌లలో అందుబాటులో ఉండాలన్నారు. ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు మండలంలోని బడిఈడు పిల్లలు పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.శ్రీనునాయక్, ఈఓపీఆర్డీ గిరిధర్, వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఏపీఓ రామకృష్ణ, పలుశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శానిటేషన్ సెక్రటరీల సమస్యలపై వినతి



వినతి పత్రం అందిస్తున్న సందెపోగు శ్రీనివాసరావు, తదితరులు

సత్తెనపల్లి: శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ అర్బన్ అధ్యక్షుడు సందేపోగు శ్రీనివాసరావు నేతృత్వంలో వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీస్ ఎదుర్కొంటున్న సమస్యల మీద చర్చించి, సచివాలయంలో ఉన్న అందరు సెక్రటరీలు ఏ విధంగానైతే ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం ఐదు గంటలకు వెళ్లడం జరుగుతుందో అదే విధమైనటువంటి టైమింగ్స్ తమకు కూడా ఇవ్వాలని కోరారు. అందరూ సెక్రటరీలకు అన్ని రకాల సెలవులు, అలాగే హెల్త్ కార్డ్స్ ఇవ్వాలన్నారు. కమిషనర్ షమ్మి స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, అన్ని రకాల లీవ్స్‌ను కూడా ఎస్ఆర్‌లో యాడ్ చేయిస్తానని చెప్పారు. సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అర్బన్ ఉపాధ్యక్షుడు పేరుపోగు రవిచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ కరీముల్లా, జిల్లా జనరల్ సెక్రెటరీ బిట్రా కొండలరావు, ఏపీ ఎన్జీవోస్ తాలూకా యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు, ఉపాధ్యక్షుడు సందెపోగు అంబేద్కర్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు నేత వెంకటపతి



మాట్లాడుతున్న చలమయ్య, పక్కన నాయకులు

సత్తెనపల్లి: చిన్న వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని తుది శ్వాస విడిచే వరకు ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచిన ఉత్తమ కమ్యూనిస్టు కామ్రేడ్ పుతుంబాక వెంకటపతి అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య అన్నారు. కామ్రేడ్ పూతంబాక వెంకటపతి 30వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ ప్రజా పోరాటాలు నిర్వహించడంలో ఎటువంటి రాజీ ధోరణి లేకుండా సమస్య పరిష్కారమయ్యే వరకు కృషి చేసే పద్ధతి సత్తెనపల్లి ప్రాంతంలో కార్యకర్తలు అందరికీ స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పోరాటాలు నిర్వహించడమే కాకుండా సమితి అధ్యక్షుడిగా, శాసనసభ్యుడిగా, ప్రజాప్రతినిధి ఎలా ఉండాలో తెలిపి ఆ పదవులకు వన్నెతెచ్చిన వ్యక్తి అని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, ధరణికోట విమల, గుంటుపల్లి బాలకృష్ణ, పెండ్యాల మహేష్, జి.పిచ్చారావు, మెట్టు పిచ్చిరెడ్డి మాట్లాడారు. తొలుత వెంకటపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జడ రాజ్ కుమార్, ఎం హరిపోతురాజు, ఎ.వీరబ్రహ్మం, కట్టా శివ దుర్గారావు, జి.రజిని, షేక్ మస్తాన్ వలి, పంతంగి ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చీకటీగలపాలెం గ్రామ ఎస్టీ కాలనీలో వినుకొండ చర్చి ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు ఎం.డి.రాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో నిరుపేదలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎం.ప్రవళిక, ట్రెజరర్ రమేష్‌బాబు, సభ్యులు ఎస్. బ్రహ్మయ్య, టి.వెంకటకృష్ణ, గ్రామపెద్దలు నారాయణ, సాగర్, సాయి పాల్గొన్నారు.

పశు నష్టపరిహారం పెండింగ్ నిధులు జమచేయాలి

ఏపీ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట



మాట్లాడుతున్న తిరుపతిరావు

సత్తెనపల్లి: రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో గొర్రెలు, మేకలు అనేక జబ్బులు, రోడ్ యాక్సిడెంట్లు, పిడుగులు పడి వేలాది జీవాలు చనిపోయి పెంపకందారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని, వైఎస్సార్ పశు నష్టపరిహార పథకం ద్వారా నమోదు చేసి రెండు సంవత్సరాలు అవుతున్న పరిహారం ఇంతవరకు రైతుల అకౌంట్‌కు జమ కాలేదని వెంటనే జమ చేయాలని ఏపీ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా స్థాయి గొర్రెల, మేకల కాపరుల సమావేశం సత్తెనపల్లి లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఎనుముల బజార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.200 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, దీని వలన పెంపకం దారులు, పాడి రైతులు అవి వస్తాయో రావా అనే ఆందోళనతో ఉన్నారన్నారు. గతంలో ఇన్సూరెన్స్ కంపెనీలు అనేక టెక్నికల్ కారణాలతో క్లెయిమ్స్ సరిగా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మార్కెట్ రేటుకు కనుగుణంగా పూర్తి బీమా వచ్చేవిధంగా మార్పులు చేయాలన్నారు. చేతి వృత్తిదార్ల సంఘం జిల్లా నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, మాగంటి చినవేరయ్య, ఎనుముల బాజీ, ఎం.కోటయ్య, మాగంటి గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామకోటయ్యకు ఎన్టీఆర్ జాతీయ కళారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రామకోటయ్య

సత్తెనపల్లి: ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని విజయవాడ శ్రీ వెనిగండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో విజయశ్రీ సాంస్కృతీసేవా సంస్థ వారు శ్రీ కవికోకిల పద్మశ్రీ గుర్రం జాషువా అవార్డు గ్రహీత, సత్తెనపల్లి వాసి పొత్తూరి రామకోటయ్యకు ఎన్టీఆర్ జాతీయ కళారత్న పురస్కారం అందించి సత్కరించారు. గడిచిన 40సంవత్సరాల నుంచి కళా రంగంలో అనేక సేవలు చేసినందుకు గాను, పౌరాణిక రంగంలో ధుర్యోధనుడు, భీముడు, రాముడు, కృష్ణుడు, భవాని లాంటి అనేక పాత్రలలో నటించి ప్రజలను మెప్పించిన రామకోటయ్యకి సంస్థ అధ్యక్షుడు బండారు నరసింహారావు, తుర్లపాటి కుటుంబరావు చేతులమీదుగా పురస్కారం అందించారు.

వలంటీర్లకు సన్మానం

నరసరావుపేట: ఉత్తమ సేవలు అందజేసి ప్రభుత్వం నుంచి అవార్డులు పొందిన 33వ వార్డు వలంటీర్లను ఘనంగా సన్మానించారు. మంగళవారం వార్డు సచివాలయంలో అవార్డులు పొంది న వలంటీర్లను వార్డు ఇన్‌చార్జీలు మర్రిపూడి రాంబాబు, కుప్పాల శ్రీనివాసరావు ఘనంగా సన్మా నించి వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

2న జగన్నాథస్వామి భూముల కౌలు వేలం

క్రోసూరు: సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో వేంచేసి ఉన్న జగన్నాథస్వామి దేవస్థానానికి చెందిన 29.18 ఎకరాల మెట్ట భూములకు కౌలు వేలం జూన్ నెల 2వ తేదీన క్రోసూరు మండలంలోని గుడిపాడు గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ రంగిసెట్టి సూరినారాయణ మంగళవారం తెలిపారు. ఈఓ వివరాలు తెలుపుతూ దేవస్థానం భూములు 29.18 ఎకరాలు క్రోసూరు మండలం గుడిపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్నందున గుడిపాడు సచివాలయ ఆవరణలో శుక్రవారం 10 గంటలకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక సంవత్సర కాలానికి కౌలు చేసుకునేందుకు (2023–24) బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29.18 ఎకరాల భూమిని ఆరుప్లాట్లుగా విభజించి ఒక్కో ప్లాటుకు విడివిడిగా వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాటలో పాల్గొను వారు ప్లాటు ఒక్కింటికి రూ.5వేలు డిపాజిట్‌గా చెల్లించాలన్నారు. హెచ్చు పాటదారునికి మినహా మిగతావారికి వారి డిపాజిట్ వాపసు చేస్తామన్నారు. వివరాలకు 9866254313 నంబరులో సంప్రదించాలన్నారు.

రేపటిలోగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి

నాదెండ్ల: మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 138 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్న విషయం విదితమే. జూన్ 1వ తేదీ వరకూ తమ లాగిన్‌లో దరఖాస్తుల సమస్యలు ఉన్నట్లయితే గ్రీవెన్స్ చేసుకోవచ్చని ఎంఈవో ఆంజనేయులు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీలు పొందేందుకు 61 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. 21 మంది లాంగ్ స్టాండింగ్ కాగా, మరో 22 మంది సర్‌ప్లస్, మరో 18 మంది రిక్వెస్ట్ కేటగిరిల్లో, ఉన్నత పాఠశాల పరిధిలో 77 మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు.

మూడు ట్రాక్టర్లు మంజూరు

నాదెండ్ల: మండలంలో మూడు రైతు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు మూడు ట్రాక్టర్లు మంజూరైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. జూన్ 2వ తేదీన గుంటూరు మిర్చి యార్డులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ యంత్రసేవ పథకం ద్వారా ట్రాక్టర్లు అందుకోనున్నారు. తూబాడులోని వై.ఎస్.జగనన్న రైతు సంఘానికి, కనపర్రులోని భారతీ కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌కు, సాతులూరు–1 రెడ్డి పేరంటాలమ్మ తల్లి హైరింగ్ సెంటర్‌కు మంజూరయ్యాయి.

ఉపాధి హామీ గ్రామసభలు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం, దమ్మాలపాడు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. పథకం నిర్వహణకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే గ్రామసభలో ప్రస్తావించవచ్చని కోరారు. ఆయా గ్రామసభల్లో ఏపీఓ రామారావు, ఎస్సార్పీ వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణలో భాగంగా దాతల సహకారంతో మంగళవారం 40 మంది పేదలు, వృద్ధులు, యాచకులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. చెర్రీస్ న్యూట్రీషన్ సెంటర్ వారి సౌజన్యంతో వేల్పూరి నరసింహారావు, మాధవిల కుమార్తె చరిష్మా ఆర్థికసాయంతో వారి చేతులమీదుగా భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ విద్య

సత్తెనపల్లి: తల్లిదండ్రులను కోల్పోయిన లేదా తల్లి లేదా తండ్రి కోల్పోయిన విద్యార్థులకు అత్యుత్తమ బోధనా సిబ్బందితో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యను ప్రగతి విద్యాసంస్థలు పూర్తి ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉందని ఆ సంస్థ డైరెక్టర్ పరిటాల నరేష్ మంగళవారం తెలిపారు. ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9966511424 నంబరులో సంప్రదించాలని కోరారు.